చిలుకల కనువిందు


గుంపులుగా వచ్చిన రామచిలుకలు


ఆహారం పెడుతున్న ఆటోడ్రైవర్ వాడ్రేవు బాలకృష్ణ, శ్రీలక్ష్మి, కుమారుడు

తాళ్లరేవు మండలం కోరింగ పంచాయతీ పరిధిలోని చిన బొడ్డువెంకటాయ పాలెం జగనన్న కాలనీలోని ఆటోడ్రైవర్ వాడ్రేవు బాలకృష్ణ ఇల్లు చిలుకలకు ఆహార కేంద్రంగా మారింది. ఆయన ఏడాది క్రితం తన ఇంటిపై పిచ్చుకల కోసమని ధాన్యం కుచ్చు కట్టారు. వాటి జాడ కనిపించ లేదు. కొద్ది రోజులకు రెండు రామచిలుకలు చేరాయి. నిత్యం ఆహారం అందుబాటులో ఉంచడంతో పదులు.. వందల సంఖ్యకు చేరాయి. బాలకృష్ణతోపాటు ఆయన భార్య, ఇద్దరు పిల్లలు రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల మధ్య, సాయంత్రం 6 గంటలకు ఇంటిపై ఆహారం సిద్ధం చేస్తారు. తొలుత 5 కేజీల ధాన్యం గింజలను ఆహారంగా పెట్టే వారమని, ప్రస్తుతం 20 కేజీలు అవసరం అవుతున్నాయన్నారు. ఆటో ద్వారా నెలకు వచ్చే రూ.12వేల ఆదాయంలో వీటి ఆహారానికి రూ.6వేలు వెచ్చిస్తున్నానన్నారు. మిగతా ధాన్యం గింజలను కొందరు పక్షి ప్రేమికులు కొనుగోలు చేసి ఇస్తున్నారని చెప్పారు. భార్య, పిల్లలు సహకారంతోనే ఈ పని చేయగలుగుతున్నానని ఆయన చెప్పారు.

-న్యూస్‌టుడే, తాళ్లరేవు

ఏమిటీ మతలబు..?

రూ.20.77 కోట్ల శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ డ్రెడ్జింగ్ పనుల్లో మార్పులు

న్యూస్‌టుడే, పి.గన్నవరం, మలికిపురం

రాజోలు దీవిలోని సముద్ర తీరంలో ఉప్పునీటి ప్రభావంతో కొబ్బరి చెట్లకు వాటిల్లుతున్న నష్టాన్ని నివారించేందుకు శంకరగుప్తం ప్రధాన మురుగు కాలువను ఆధునికీకరించేందుకు కూటమి ప్రభుత్వం గత డిసెంబరులో రూ.20.77 కోట్లు మంజూరు చేసింది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్వయంగా విచ్చేసి మలికిపురం మండలం కేశనపల్లి వద్దగల ప్రధాన మురుగు కాలువను, చనిపోయిన చెట్లను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడి నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కృషితో నిధులు మంజూరు కావడం, టెండర్లు పిలవడం, గుత్తేదారు ఖరారు కావడం చకచకా పూర్తయ్యాయి. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పనులు మొదలుపెట్టారు. తాజాగా ఒక విభాగం నుంచి మరో విభాగానికి ఈ పనులను బదలాయించడం ఎవరి ప్రయోజనం కోసమోనని సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.

ఓ రాజకీయ నాయకుడి ఒత్తిడితో..

శంకరగుప్తం ప్రధాన మురుగు కాలువ పనుల బాధ్యత డ్రెయినేజీ విభాగానికి వస్తుంది. గత రెండేళ్లుగా ఈ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించి అంచనా తయారు చేసి ఉన్నతస్థాయి అధికారులకు పంపారు. వీరి ఆధ్వర్యంలోనే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పనులు జరుగుతున్నాయి. ఉన్నట్టుండి ఈ పనులను ఈ డివిజన్ నుంచి గోదావరి మధ్యడెల్టా ఇరిగేషన్ డివిజన్‌కు బదలాయిస్తూ జలవనరులశాఖలోని ఉన్నతాధికారి ఆదేశాలు ఇచ్చారు. ఈ చర్య విమర్శలకు తావిస్తోంది. ఓ రాజకీయ నాయకుడి ఒత్తిడే దీనికి కారణమని చర్చించుకుంటున్నారు.


శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ పూడికతీత

ఇప్పటివరకు జరిగినవి ఇలా..

22.90 కిలోమీటర్ల మేర ఉన్న శంకరగుప్తం ప్రధాన మురుగు కాలువ ఆధునికీకరణకు సంబంధించి డ్రెడ్జింగ్ ద్వారా కేశవదాసుపాలెం నుంచి కరవాక వరకు 8.50 కిలోమీటర్ల మేర సుమారు 5 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక తీయాలి. కరవాక నుంచి శంకరగుప్తం వరకు 14.50 కిలోమీటర్ల మేర ఇరువైపులా గట్లను పటిష్ఠపర్చాలి. ఇంత వరకు సుమారు 1.50 లక్షల క్యూబిక్ మీటర్ల మేర పూడిక తీశారు.

అధికారిని మార్చకుండానే కొనసాగింపు

డ్రెయినేజీ నుంచి ఇరిగేషన్ విభాగానికి బదలాయించినప్పటికీ డ్రెయినేజీ జేఈని మాత్రం మార్చకుండా పనులు చేపట్టాలని యోచిస్తున్నారు. ఒత్తిడిని భరించలేక సదరు అధికారి తనను కూడా మార్చాలని అభిప్రాయం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీనికి ఒక రాజకీయ నాయకుడు ససేమిరా అన్నట్టు సమాచారం.

మధ్యడెల్టాకు బదలాయింపు

శంకరగుప్తం ప్రధాన మురుగుకాలువ ఆధునికీకరణ పనుల పర్యవేక్షణను డ్రెయినేజీ విభాగం నుంచి గోదావరి మధ్యడెల్టాకు బదలాయిస్తూ ఉన్నతాధికారి ఉత్తర్వులు ఇచ్చారు. ఇక మీదట ఈ పనులను మధ్యడెల్టా డివిజన్ పర్యవేక్షిస్తుంది.

- కె.వెంకటేశ్వరరావు, ఈఈ, గోదావరి మధ్యడెల్టా

గోకులాలు.. వాటాల పంచాయితీలు

- జిల్లాకు 144 మంజూరు
- కేటాయింపులు తక్కువ.. పోటీ ఎక్కువ

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

పాడి పశువుల రక్షణకు వీబీ జీ రామ్‌జీ పథకంలో మంజూరైన గోకులాల కోసం గ్రామస్థాయిలో పంచాయతీలు మొదలయ్యాయి. మంజూరు తక్కువగా ఉండటం, ఆశిస్తున్నవారు ఎక్కువ మంది కావడంతో నాయకులు సర్ది చెప్పడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది (2026-27) మెటీరియల్ కాంపోనెంట్ విభాగంలో కొత్తగా 144 మంజూరు చేశారు. యూనిట్ విలువ రూ.2 లక్షలు కాగా.. ఎంపికైన రైతులు 10 శాతం భరిస్తే మిగిలిన సొమ్ము రూ.1.80 లక్షలు వీబీ జీ రామ్‌జీ పథకంలో విడుదల చేస్తారు. గత ఏడాది జిల్లాలో 1,230 గోకులాలు మంజూరు కాగా.. 50 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.


గోకులం షెడ్

ఎలా సరుబాటు చేయాలి..?

గోకులాల నిర్మాణానికి లబ్ధిదారుల నుంచి పోటీ ఎక్కువగా ఉంది. 90 శాతం రాయితీ కల్పిస్తున్న తరుణంలో రైతులు వీటి నిర్మాణానికి ముందుకు వస్తున్నారు. మంజూరు సంఖ్య తక్కువగా ఉండటంతో ఎంపిక విషయంలో ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెరుగుతోంది. గతంలో కొంతమంది ఎమ్మెల్యేల వద్ద పంచాయతీలు పెట్టారు. విడతల వారీగా అందరికీ అవకాశం కల్పిస్తామని సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. డ్వామా పీడీ జి.రామ్‌గోపాల్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు.

కోనసీమ జిల్లాలో వివరాలు ఇలా..

నియోజకవర్గం	మంజూరు
అమలాపురం	26
ముమ్మిడివరం	24
పి.గన్నవరం	31
రాజోలు	15
కొత్తపేట	30
రామచంద్రపురం	18

గింజ గుట్టు తెలుసుకునేట్టు..!

బియ్యం బస్తాలకు క్యూఆర్ కోడ్

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ప్రజా పంపిణీ వ్యవస్థలో లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వం క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసుకువచ్చింది. ప్రతిబస్తాకు ఓ క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఎంపిక చేసిన ఎంఎల్ఎస్ పాయింట్ల పరిధిలో ఈ విధానం అమలు చేయగా.. కోనసీమలోని అన్ని రేషన్ దుకాణాల్లోనూ అమలు చేస్తున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట..



రైతుల నుంచి రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కేలు) ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం మిల్లింగ్ చేసి (సీఎంఆర్) బియ్యాన్ని ఎఫ్‌సీఐ గోదాంలకు చేరవేస్తారు. అక్కడి నుంచి మండల స్థాయి నిల్వకేంద్రాలు (ఎంఎల్ఎస్) తర్వాత రేషన్ దుకాణాలకు తరలించి లబ్ధిదారులకు అందజేస్తారు. బస్తాపై ఉన్న కోడ్ స్కాన్ చేస్తే.. ధాన్యం ఏ సీజన్‌లో కొనుగోలు చేశారు.. ఏ మిల్లు నుంచి సీఎంఆర్ వచ్చిందనే వివరాలు ఉంటాయి. వీటిని యాప్‌లో స్కాన్ చేయడం ద్వారా రేషన్ దుకాణానికి చేరిన బియ్యానికి సంబంధించి వివరాలు నమోదవుతాయి. బియ్యం రవాణా, పంపిణీలో అక్రమాలు చోటుచేసుకోకుండా క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసుకువచ్చారు.

జిల్లా వివరాలు ఇలా..

రేషన్ కార్డులు	4,58,585
యూనిట్లు	13,15,818
రేషన్ దుకాణాలు	779
ప్రతి నెలా పంపిణీ చేసే బియ్యం	6579 టన్నులు

బియ్యం పంపిణీ సమయంలోనూ..

ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బస్తాలను రేషన్ దుకాణాలకు తరలించిన తర్వాత అక్కడ డీలర్లు యాప్‌లో ప్రతి బస్తాపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. తర్వాత ఈ-పోస్ యంత్రం ద్వారా స్కాన్ చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలి. సెప్టెంబరు నుంచి దీనిని అమలు చేయాలని ఆదేశాలు వచ్చాయి. యాప్ సక్రమంగా పని చేయక పోవడం, గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాల సమస్య ఉండటంతో ప్రతి బస్తాను స్కాన్ చేసేందుకు ఎక్కువ సమయం పడుతుందని చెబుతున్నారు.

ఎల్ఈడీ వెలుగుల్లో.. నిబంధనలకు గ్రహణం



కొందరు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు అధిక వెలుతురు వచ్చే ఎల్ఈడీ హెడ్‌లైట్లు ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా తిరుగుతున్నారు. దీనివల్ల ఎదురుగా వెళ్లేవారు దారి కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురుగా వాహనాలు వచ్చేటప్పుడు లో బీమ్ ఉపయోగించాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదు. దీంతో కళ్లలోకి నేరుగా కాంతి పడుతోంది. అమలాపురం బస్టాండ్ సమీపంలో కనిపించిన చిత్రాలివి.. -న్యూస్‌టుడే, కోనసీమ

మొగలో నిర్లక్ష్యం మేట

పూడిక తీయని వైనం

న్యూస్‌టుడే, కాట్రేనికోన

గచ్చకాయలపోర సముద్ర తీరంలో కూనవరం స్ట్రెయిట్‌కట్ డ్రెయిన్ మొగ వద్ద పూడికతో అటు రైతులు, ఇటు మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూనవరం, ఉప్పలగుప్తం మండలాలకు చెందిన సుమారు 20వేల ఎకరాల్లోని ఆక్వాచెరువులు, చేలను ఆనుకుని ఉన్న డ్రెయిన్ల నీరంతా కూనవరం డ్రెయిన్‌లో కలిసి సముద్రంలోకి ప్రవహిస్తుంది. ఈ డ్రెయిన్ గట్లు బలహీన పడటం, అక్కడక్కడ కోతకు గురవ్వడం, సముద్రతీరం వద్ద ఇసుకమేట మేయడంతో కొన్నేళ్లుగా నీరు దిగని పరిస్థితి నెలకొంది. వర్షాలు, వరదలు వేళ బోదెలు, కాలువల్లో నీరంతా దిగక ముంపు సమస్య ఏర్పడి రైతులు నష్టపోతున్నారు. మరో వైపు సముద్రపు పర్రలోకి నీరు రాకపోవడంతో మత్స్యసంపద తగ్గి మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారు.

పరిష్కారం ఏమిటి..?

కూనవరం డ్రెయిన్‌లో గచ్చకాయలపోర వరకు డ్రెడ్జింగ్ పనులు చేపట్టినా అవి పూర్తికాలేదు. డ్రెయిన్ గట్టుతోపాటు కాట్రేనికోనలో సముద్రపుపర్ర ఏటిగట్టు గచ్చకాయలపోర నుంచి బలుసుతిప్ప వరకు ఎక్కడికక్కడ పాడైంది. ఉప్పునీరు చేరి పంటలు, కొబ్బరిచెట్లు పాడవుతున్నాయి. పర్ర గట్టును బలపరచి, డ్రెయిన్లు, కాలువల లాకులు, తలుపుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. గతంలో ప్రతిపాదనలు పంపినా ఫలితం లేదు.


పూడికపోయిన మొగ

వేట ఎలా..?

పర్రలోకి, కూనవరం డ్రెయిన్‌లోకి సముద్రపు నీరు వచ్చేది. అందులోకి మత్స్యసంపద చేరడంతో పరిసర ప్రాంతాల మత్స్యకార కుటుంబాలు చేపలవేటతో జీవనం సాగించేవి. మొగ మూసుకుపోవడంతో నీరు రావడం లేదు. 15వేల మంది మత్స్యకారులకు జీవనోపాధి పోయింది. చాలామంది ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోయారు. మొగ తవ్వాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో మత్స్యకారులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. ముందుగా డ్రెయిన్ సముద్రంలో కలిసేలా డ్రెడ్జింగ్ చేయాలని కోరుతున్నారు.

నిధులు మంజూరైతే పనులు

మొగ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. కూనవరం డ్రెయిన్ రాఘవుల పేట నుంచి గచ్చకాయలపోర వరకు 2 కిలోమీటర్ల మేర డ్రెడ్జింగ్ పనులు చేయించాం. డ్రెయిన్ నుంచి సముద్రపు పర్రలోకి, సముద్రంలోకి తవ్వేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

-సునీత, డ్రెయిన్స్ ఏఈ

కడియపులంక నర్సరీ సంఘ అధ్యక్షుడిగా సుబ్బారాయుడు

కడియం: కడియపులంక సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్ష పదవికి బొరుసు సుబ్బారాయుడు, రత్నం అయ్యప్ప అభ్యర్థులు పోటీపడ్డారు. 1,621 ఓట్లు పోలయ్యాయి. సుబ్బారాయుడుకు 985 ఓట్లు, రత్నం అయ్యప్పకు 629 ఓట్లు వచ్చాయి. 356 ఓట్ల ఆధిక్యంతో సుబ్బారాయుడు నూతన అధ్యక్షుడిగా గెలుపొందారు. ఏడు ఓట్లు చెల్లనివిగా తేల్చారు. దూలం సత్యనారాయణమూర్తి 85 ఓట్లు, పుల్లా శ్రీను 96 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఏకగ్రీవమైన వార్డు సభ్యులు కామిశెట్టి వెంకటేశ్, ఉండమట్ల అర్జున్, గట్టా కృష్ణ భగవాన్, సానా పల్లపురాజు, డేగల రాము, బోడపాటి చంద్రశేఖర్, పాటంశెట్టి శ్రీనివాస్, తాడాల సత్యనారాయణ, అన్నందేవుల వెంకటేశ్వరరావు (బాబు)తో నూతన పాలకవర్గం కొలువుదీరింది. వారికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందనలు తెలిపారు.

వాతావరణ సమతుల్యతకు అనంత అరణ్య

న్యూస్‌టుడే, పి.గన్నవరం

సమాజానికి కాలుష్య రహిత వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం 'అనంత అరణ్య' ప్రోగ్రాంను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా డ్వామా ఆధ్వర్యంలో ఫారెస్ట్ బై హార్ట్‌ఫుల్‌నెస్ ఫౌండేషన్ సహకారంతో విద్యాలయాల చెంతన మొక్కలు నాటి సంరక్షిస్తారు. జిల్లాలో నరేంద్రపురం, గోడి, ద్రాక్షారామ, శివకోటి, అంతర్వేదిపల్లిపాలెం గురుకుల పాఠశాలలను ఎంపిక చేశారు. ఖాళీ ప్రదేశాల్లో వివిధ రకాల మొక్కలు నాటి చిట్టడవులను తలపించేలా చేయనున్నారు.


నరేంద్రపురం గురుకుల పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలు

రూ.4.96 లక్షలు కేటాయిస్తున్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతిఒక్కటీ బతికేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

25 సెంట్ల జాగాలో..

25 సెంట్లలో వివిధ రకాలకు చెందిన 1,625 మొక్కలు నాటతారు. అయిదు మీటర్లకు ఒకటి చొప్పున 40 బ్లాకులు ఏర్పాటు చేస్తారు. ప్రతి బ్లాకు వద్ద పొడవు, మధ్యస్థ, చిన్న స్థాయిలో ఎదిగేలా నాటతారు. వీబీజీ రామ్‌జీ కింద

బహుళ ప్రయోజనం

వందల సంఖ్యలో మొక్కలను అన్ని జాగ్రత్తలతో నాటిస్తున్నాం. వీటివద్ద సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేస్తాం. వాననీటి సంరక్షణ, కిచెన్‌గార్డెన్ ఇలా పలు అంశాలతో చిట్టడవులు ఏర్పాటవుతాయి.

-జి.ఎస్.రామ్‌గోపాల్, డ్వామా పీడీ

తిరుమల తరహాలో వాడపల్లి క్షేత్రం అభివృద్ధి

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో శ్రీవకుళమాత అన్నదాన భవన ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన మాట్లాడారు. ఒకేసారి 3వేల మందికి భోజనాలు, రోజుకు సుమారు 40వేల మందికి ప్రసాదం సిద్ధం చేసేలా సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు.
- ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ.. ఆలయానికి సునాయసంగా చేరుకునేందుకు రూ.8 కోట్లతో రావులపాలెం నుంచి ఏటిగట్టు రహదారి అభివృద్ధి చేయనున్నామన్నారు. అన్నదాన భవనానికి పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.1.50 కోట్లు ఇచ్చారన్నారు. తణుకు, ఆచంట ఎమ్మెల్యేలు ఆరిమిల్లి రాధాకృష్ణ, పితాని సత్యనారాయణ, ఆలయ కమిటీ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, తెదేపా జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంతకుమారి, కూటమి నాయకులు రామకృష్ణ, బండారు శ్రీనివాస్, భాజపా జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామరాజు పాల్గొన్నారు.


ఆహారం వండే పాత్రను ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, చిత్రంలో ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ తదితరులు

సాలీడు.. అద్భుత గూడు



సాలీడు కీటకాల వేట కోసం ఉచ్చును అల్లడంలోనే కాదు.. గుడ్లకు రక్షణ కల్పించేందుకు అద్భుత గూడును కడుతుంది. ఎండ, వాన, శత్రు కీటకాల నుంచి రక్షణ ఉండేలా ఆకుల కిందభాగంలో ప్రత్యేక గుడ్ల సంచి(గూడు) తయారు చేస్తుంది. ఇతర జీవులు లోపలికి వెళ్లకుండా నోటి నుంచి వచ్చే సన్నని దారంతో దీనిని రూపొందిస్తుంది. తర్వాత అందులో గుడ్లు పెడుతుంది. సుమారు నెలరోజుల్లో వాటి నుంచి పిల్లలు వస్తాయి. కోరింగ అభయారణ్యానికి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.మహేష్ మాట్లాడుతూ తల్లి జీవి సుమారు 45 రోజులు ఆ గూడులో సుప్తావస్థలో ఉంటుందన్నారు. గుడ్లు, పిల్లల రక్షణకు ఇది అద్భుత రక్షణ కవచం అన్నారు. అమలాపురం మండలం రంగాపురం శివాలయం వద్ద మామిడి చెట్టు ఆకుపై కనిపించిన సాలీడు అల్లిన గూడు ఇది. – న్యూస్‌టుడే, కోనసీమ

కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ



గంగవరం, న్యూస్‌టుడే: కరాటే శిక్షణ.. ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యకరమైన జీవనం సొంతం చేసుకోవచ్చని ఔత్సాహికులకు చెందిన కరాటే గురువు జి.సూరిబాబు అన్నారు. ఆదివారం పోలవరం జిల్లా గంగవరం ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం సీహెచ్.సత్యవతి, వార్డెన్ లావణ్య ఆధ్వర్యంలో విద్యార్థినిలకు ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరాటే మాస్టర్లు సూరిబాబు, శివ విద్యార్థినిలకు కరాటేలో ఆత్మరక్షణకు సంబంధించి పలు మెలకువలను నేర్పించారు. ప్రతి ఆదివారం ప్రత్యేక కరాటే శిక్షణ తరగతులను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థినిలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లోవకు భక్తుల తాకిడి



తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తుల తాకిడితో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో దేవస్థానంలోని క్యూలైన్లు, వసతి గదులు నిండిపోయాయి. భక్తులు ఆలయ ప్రాంగణంలోని చెట్లకింద వంటావార్పు చేసుకొని సామూహిక భోజనాలు చేశారు. ఈ ఒక్కరోజే సుమారు 10 వేలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో దేవస్థానానికి రూ.5.01 లక్ష ఆదాయం సమకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు.

సముద్రతీరంలో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ



సూర్యారావుపేట (కరప): కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తిమ్మాపురం ఎస్సై గణేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం సెలవు కావడంతో సముద్రతీర ప్రాంతానికి పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చి ఉల్లాసంగా గడిపారు. ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ జి.బింధుమాధవ్ ఆదేశాల మేరకు తిమ్మాపురం, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డ్రోన్ కెమెరాలను వినియోగించి పర్యవేక్షించారు.

ఎల్‌నినో వర్రీ..

న్యూస్‌టుడే, ముమ్మిడివరం



ఎం.నంద కిశోర్

ప్రస్తుతం ఖరీఫ్ సాగులో ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోంది. వర్షాభావ పరిస్థితులు.. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం.. వంటి పరిస్థితుల్లో వరి పంటలో పలు రకాల పోషక లోపాలు, పురుగులు, తెగుళ్లు బారినపడుతున్నాయి. ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్య రక్షణ చర్యలపై జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా (ఏరువాక) కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ డా.ఎం.నందకిశోర్ 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో పలు విషయాలు వెల్లడించారు.

ఎరువుల వినియోగం తగ్గించాలి..

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో వరి సాగులో ఎరువుల వినియోగం తగ్గించాలి. విచ్చలవిడిగా ఎరువుల వినియోగం వల్ల లాభం కన్నా.. చేటు ఎక్కువగా ఉంటుంది.

పంటలో పొటాష్ లోపం

- జిల్లాలో 1.15 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి.
- జులై మొదటి వారంలో వరినాట్లు వేసిన చేలు అంకురం దశకు చేరుకున్నాయి.
- ఆలస్యంగా వరినాట్లు పడిన ప్రాంతాల్లో దుబ్బు చేసే దశలో ఉన్నాయి.
- వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటలో 'పొటాష్' లోపం ఎక్కువగా కనిపిస్తోంది.
- ముదురు ఆకులలో ఇది వస్తుంది. ఆకుల చివరి నుంచి అంచులు లేత గోధుమ రంగుకు మారి క్రమేణా ఆకులు ఎండిపోతాయి.
- దీని నివారణకు లీటరు నీటికి 'మల్టీ కె' 10 గ్రాముల పొడిమందును కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- అంకురం దశలో పొటాష్ ఎరువు 20 కిలోలు యూరియాతో పాటు వేసుకోవాలి.

చీడపీడల ప్రభావమూ ఎక్కువే..

అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఆకునల్లి ఎక్కువగా ఆశిస్తోంది. వర్షాభావ పరిస్థితుల్లో.. ఇవి ఆకుల వెనక భాగంలో సమూహాలుగా చేరి రసం పీల్చడం వల్ల ఆకులపై తెలుపు, పసుపు రంగు మచ్చలు, చారలు ఏర్పడి ఆకులు కాషాయం రంగుకు మారి ఎండిపోతాయి. నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు, ప్రొఫెనోఫాస్, 2 మిల్లీ లీటర్లు, స్పైరోమెసిఫెన్ 1 మిల్లీలీటరు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మండి పురుగు ఆశించడం వల్ల.. మొవ్వ ఆకు ఎండిపోయి చనిపోతుంది. నివారణకు దుబ్బు చేసే దశలో కార్బోఫ్యూరాన్ 3-జి గుళికలు 10 కిలోలు లేదా క్లోరిపైరిపాస్ 2.5 మిల్లీ లీటర్లు, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం పొడి మందు 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. చిరుపొట్ట దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4-జి గుళికలు 8 కిలోలు, క్లోరంట్రానిలిప్రోల్ 0.4-జి గుళికలు 4 కిలోలు వేయాలి. భవిష్యత్తులో పాముపొడ తెగులు, సుడిదోమ తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున గమనించి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.



'విలువ.. అదనపు విలువ' పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న అర్థశాస్త్ర ఉపన్యాసకులు భరత్

దేశంలో నిరుద్యోగం.. అప్పుల భారం

అర్థశాస్త్ర ఉపన్యాసకులు భరత్

రామచంద్రపురం: ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతున్నా ప్రజల కొనుగోలు శక్తి అదే స్థాయిలో పెరగకపోవడంతో దేశంలో నిరుద్యోగం, అప్పుల భారం, మార్కెట్ సంక్షోభం పెరుగుతున్నాయని అర్థశాస్త్ర ఉపన్యాసకులు పి.భరత్ అన్నారు. ప్రముఖ విశ్లేషకులు రావు కృష్ణారావు రచించిన 'విలువ.. అదనపు విలువ' పుస్తకాన్ని పట్టణంలోని చెలికాని రామారావు స్మారక భవనంలో ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 2008 తర్వాత ప్రపంచవ్యాప్తంగా వచ్చిన పెట్టుబడిదారీ సంక్షోభాలతో మార్క్సిస్ట్ సిద్ధాంతాలను అధ్యయనం చేస్తున్నారని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) డిజిటల్ ప్లాట్‌ఫారంలు ఉత్పత్తి రంగాన్ని వేగంగా మారుస్తున్నాయని పేర్కొన్నారు. విలువ.. అదనపు విలువ వంటి మార్క్సిస్టు రాజకీయ, ఆర్థిక శాస్త్ర గ్రంథాల అధ్యయనం ద్వారా విద్యార్థులు, కార్మికులు సమాజంలోని ఆర్థిక సంబంధాలను శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలని కోరారు. అనంతరం పుస్తకాన్ని దారిదీపం పత్రిక సంపాదకుడు డి.వి.వి.ఎస్.వర్మకి అంకితమిచ్చారు. డాక్టర్ సి.కృష్ణ మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తిత్వం కృష్ణబాబు సొంతం

విగ్రహావిష్కరణలో సభాపతి అయ్యన్నపాత్రుడు



కృష్ణబాబు విగ్రహం



విగ్రహావిష్కరణలో సభాపతి అయ్యన్నపాత్రుడు. చిత్రంలో అచ్చిబాబు, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు కామినేని, ముప్పిడి, తెలంగాణ మంత్రి తుమ్మల, మాజీ ఎంపీ కేవీపీ, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మచ్చలేని మహోన్నత వ్యక్తిత్వం కృష్ణబాబు సొంతమని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ కృష్ణబాబు అభిమాన సంఘం ఆధ్వర్యంలో గామన్ వంతెన కూడలిలో మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. దొమ్మేరులో బస్ స్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆంధ్రా సుగర్స్ సీఎండీ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, కృష్ణబాబు విగ్రహాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. కైకలూరు శాసనసభ్యుడు కామినేని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సంస్మరణ సభలో 'జమిందారు నుంచి జనం మనిషిగా ఎదిగిన ప్రజా నేత' పేరిట ముద్రించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ మంచి, మానవత్వానికి కృష్ణబాబు ప్రతిరూపమన్నారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మాజీ ఎంపీలు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడారు. కృష్ణబాబు సోదరుడు, తెదేపా నాయకుడు పెండ్యాల అచ్చిబాబు మాట్లాడుతూ తన అన్న పార్టీలు, కులాలకు అతీతంగా అందరికీ సహాయపడేవారన్నారు. కృష్ణబాబు కుమార్తె అర్చన మాట్లాడుతూ అందరి హృదయాల్లో స్థానం సంపాదించిన మహోన్నత వ్యక్తికి కూతురిగా పుట్టినందుకు గర్వపడుతున్నానని ఉద్వేగానికి లోనయ్యారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా తెదేపా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణచౌదరి, అవంతి సంస్థల అధినేత అల్లూరి ఇంద్రకుమార్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి పీతల సుజాత, జడ్పీ మాజీ ఛైర్మన్లు ఇమ్మణ్ణి రాజేశ్వరి, ముళ్లపూడి బాపిరాజు, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మాజీ ఎమ్మెల్యేలు బూరుగుపల్లి శేషారావు, టీవీ రామారావు, కృష్ణబాబు అల్లుడు, తెదేపా నాయకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, అల్లూరి విక్రమాదిత్య, భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కృష్ణబాబు కుటుంబ సభ్యులు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. వేలాది మంది స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ గోవింద నామ స్మరణతో ప్రతిధ్వనించాయి. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపింది. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామివారి ఆలయానికి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దేవస్థానం ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



అష్టోత్తర పూజ నిర్వహిస్తున్న అర్చకుడు, పూజల్లో పాల్గొన్న భక్తజనం

భవన నిర్మాణ పనుల పరిశీలన

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం కోటిలింగాలపేట సమీప పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రంలో నిర్మిస్తున్న పిండ ప్రధాన భవన నిర్మాణాన్ని ఆదివారం దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ పరిశీలించారు. పుష్కరాలకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. అనంతరం ఆయన నగరంలోని ధార్మిక సంస్థలు, పుష్కరఘాట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారని సత్రం సహాయ కమిషనర్ పి.విశ్వనాథరాజు తెలిపారు. ఆర్‌జేసీ వి.త్రినాథరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ టి.దుర్గేష్, జిల్లా దేవాదాయశాఖ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

సేవలు ప్రశంసనీయం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమాచార, పౌరసంబంధాల శాఖలో 39 ఏళ్లకుపైగా వివిధ హోదాల్లో పెద్దింటి రవి అందించిన సేవలు ప్రశంసనీయమని సమాచార, పౌరసంబంధాల శాఖ జోన్-2 ఆర్జేడీ టి.తిమ్మప్ప కొనియాడారు. ఆదివారం స్థానిక టౌన్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న హోటల్ బ్లూమ్‌లో తూర్పుగోదావరి జిల్లా పౌరసంబంధాల అధికారి(డీపీఆర్వో)గా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేయనున్న పెద్దింటి రవికి ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తిమ్మప్ప మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు మీడియా సమన్వయంలో రవి చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. తన ఉద్యోగ ప్రస్థానంలో అండగా నిలిచి ఆదరించి ప్రోత్సహించిన ఉన్నతాధికారులకు, ఉద్యోగులకు, మీడియా మిత్రులకు రవి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రవి దంపతులను సత్కరించారు. సమాచార శాఖ డీడీ బి.పద్మజ, తూర్పుగోదావరి జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ, విశ్రాంత ఉపసంచాలకుడు దాసరి నాగార్జున, సీనియర్ పాత్రికేయుడు టి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

బాటల బాగుకు భరోసా

రూ.873 కోట్లతో మౌలిక వసతుల కల్పన

మండపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయితీల రూపురేఖలను మార్చేందుకు హైబ్రీడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం) విధానంలో భారీ ప్రాజెక్టు చేపట్టింది. నగరాలు, పట్టణాల్లో ప్రాధాన్యతను బట్టి కేటాయించిన నిధులతో సీసీరోడ్లు, బీటీరోడ్ల నిర్మాణంతో పాటు గుంతలమయంగా మారిన ప్రధాన కాలనీల్లో అంతర్గత రహదారుల స్థానంలో పటిష్ఠమైన డబుల్ లేయర్ బీటీరోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో నాణ్యమైన రోడ్లు నిర్మించనున్నారు. వర్షాకాలంలో రోడ్లపై నీరునిల్వ ఉండకుండా ప్రధాన అవుట్‌లెట్ డ్రెయిన్లను ఆధునీకీకరించనున్నారు. ప్రమాదాలు జరగకుండా కూడళ్ల అభివృద్ధి సెంట్రల్ లైటింగ్, డివైడర్ల అధునీకరణ, ముఖ్య జంక్షన్ల విస్తరణ, పాదచారులకు కాలిబాటలు నిర్మించనున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 2 కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయితీల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా మిగిలిన రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం రూ.873 కోట్లు మంజూరు చేసింది. పనులను ప్రముఖ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ ఏజెన్సీలకు అప్పగించింది.



మండపేటలో ప్రతిపాదించిన గొల్లపుంత బైపాస్ రోడ్డు

నిర్మాణ సంస్థలు ఇవే..

ఆయా పనులకు సీఐఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎస్‌జీఎస్ ఇంజినీరింగ్ సర్వీసెస్, ఈసీటీ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్, ఎస్ఆర్ కన్సల్టెన్సీ, సత్య అసోసియేషన్ నిర్మాణ సంస్థలుగా వ్యవహరిస్తున్నాయి.

హెచ్‌ఏఎం ప్రాధాన్యత..


సాధారణంగా కాంట్రాక్టు విధానంలో పనులకు నిధుల కొరత లేదా ఇతర కారణాలతో ఆలస్యమయ్యే అవకాశం ఉంటుంది. దీనికి భిన్నంగా హెచ్‌ఏఎం విధానంలో పనుల్లో నాణ్యత, సమయపాలన, నిర్వాహణ బాధ్యతలను నిర్దేశిత ఏజెన్సీలకు అప్పగిస్తారు. ప్రభుత్వం విడతల వారీగా నిధులు విడుదల చేస్తూ నాణ్యత, ప్రమాణాలను క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీ చేస్తుంది. దీనివల్ల ప్రజాధనం సద్వినియోగంతో పాటు ఏళ్ల తరబడి రోడ్లు, డ్రెయిన్లు పటిష్ఠంగా ఉంటాయి.

పట్టణం/ నగరం	కేటాయించిన నిధులు(రూ.కోట్లలో)
రాజమహేంద్రవరం (కార్పొరేషన్)	300
కాకినాడ (కార్పొరేషన్)	93
పిఠాపురం పట్టణం	200
కొవ్వూరు	50
మండపేట	30
అమలాపురం	25
నిడదవోలు	25
పెద్దాపురం	26
తుని	30
సామర్లకోట	25
రామచంద్రపురం	17
ఏలేశ్వరం నగర పంచాయితీ	20
ముమ్మిడివరం	12
గొల్లప్రోలు	20

టెండర్లు ఖరారయ్యాయి..

అభివృద్ధి పనుల్లో ఆలస్యం చోటుచేసుకోకుండా రాష్ట్ర పురపాలక శాఖ ఏజెన్సీలకు పనులు కేటాయించింది. ఆయా సంస్థలకు పనులు అప్పగించి టెండర్లు ఖరారు చేశారు. నగరాలు, పట్టణాల్లో ప్రతిపాదిత పనులు నెల రోజుల్లో ప్రారంభించే అవకాశం ఉంది.

– శేషగిరి, ఈఈ, ప్రజారోగ్య శాఖ, రాజమహేంద్రవరం



'ఇస్కాన్' వెలుగులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. గౌతమఘాట్‌లోని మందిరంలో ఆదివారం మంగళహారతి, దర్శన హారతి, భాగవత ప్రవచనం, హయగ్రీవ యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సత్యగోపీనాథ్‌దాస్ ప్రభుజీ, ప్రతినిధులు హేమనిమాయిదాస్, రవీంద్రదాస్, శివానంద నిమాయిదాస్ తదితరులు పర్యవేక్షించారు. వేడుకల సందర్భంగా ఇస్కాన్ మందిరం, పరిసర ప్రాంతాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

చికిత్స పొందుతూ ఖైదీ మృతి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఓ వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని కృత్తివెన్ను మండలం ఊర్లగొండిప్ప గ్రామానికి చెందిన జే.ఏసుబాబు(57) ఓ హత్య కేసులో నిందితుడిగా ఉండడంతో కోర్టు జీవిత ఖైదు విధించింది. 2019 అక్టోబరు ఏడో తేదీ నుంచి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. హృదయ సంబంధిత అనారోగ్య సమస్యతో బాధపడుతూ మందులు వినియోగిస్తున్నాడు. ఈనెల 25న ఆరోగ్యం క్షీణించడంతో జైలు అధికారులు జీజీహెచ్‌లో చేర్పించారు. 26వ తేదీ నుంచి వెంటిలేటర్‌పై ఉంచి వైద్యులు చికిత్స అందించారు. 29వ తేదీ రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు ఆదివారం కేసు నమోదు చేశామని మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి దొమ్మేటి కృషి అజరామరం

కడియం, న్యూస్‌టుడే: బీసీల అభ్యున్నతికి దొమ్మేటి వెంకటరెడ్డి కృషి చిరస్మరణీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కొనియాడారు. కడియం మండలం మాధవరాయుడుపాలెం పరిధి గుబ్బలవారిపాలెంలో ఆదివారం ఎమ్మెల్యే గోరంట్లతో కలసి మంత్రి శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనుక్షణం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా చట్టసభల్లో రిజర్వేషన్లు పెంచే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. దాంతో వారికి మరిన్ని రాజ్యాంగ స్థానాలు పొందే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ శెట్టిబలిజ సంక్షేమానికి అలుపెరుగని పోరాటాలతో ప్రజాహృదయాలను గెలుచుకున్న మహోన్నత వ్యక్తి దొమ్మేటి వెంకటరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమానికి చెల్లుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా మాజీ కార్పొరేటర్ పాలిక శ్రీను విగ్రహ దాతగా వ్యవహరించారు. డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షుడు గుత్తుల సాయి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి రఘురామ్, పితాని శివరామకృష్ణ, సానబోయిన వినోద్, గుత్తుల గోవిందు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే గోరంట్ల, ప్రజాప్రతినిధులు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	16,000
పాతకాయ: గండేరా	23,500
గటగట	21,000
కొత్తకాయ: గండేరా	23,000
గటగట	20,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	19,000-21,000
కొత్త (పచ్చి) కాయ	20,000-21,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	257-00

సమగ్ర సంతృప్తికర సేవల దిశగా అడుగులు

'న్యూస్‌టుడే'తో అన్నవరం ఈవో

ముఖాముఖి



అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు పూర్తి స్థాయిలో సంతృప్తికర సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళిక చేస్తున్నామని ఈవో చక్రధరరావు తెలిపారు. ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. పలు అంశాలపై ఆయన 'న్యూస్‌టుడే'కు వివరించారు. ఆయనేమన్నారంటే..

● ఆధునిక సాంకేతికతతో అందరికీ వసతి : స్వామి దర్శనానికి వచ్చే భక్తులు అందరికీ వసతి కల్పించాలన్నదే లక్ష్యం. ప్రస్తుతం సుమారు 500 గదులు ఉన్నాయి. రద్దీ రోజులు, పర్వదినాలు, పెళ్లిళ్ల సమయంలో సరిపోవడం లేదు. నూతనంగా సీతారామ వసతి సముదాయం నిర్మాణం జరుగుతుంది. సత్యగిరిపై తితిదే సహకారంతో మరో 135 గదుల వసతి సముదాయాన్ని నిర్మించాలని భావిస్తున్నాం. దీనిపై ఇటీవల ధర్మకర్తల మండలిలో తీర్మానం జరిగింది. అనుమతులు వచ్చి నిర్మాణం జరిగితే వసతి ఇబ్బందులు ఉండవు. దళారులకు కళ్లెం వేస్తున్నాం. ఆధార్ సరిపోల్చిన తర్వాతే గది కేటాయిస్తున్నాం. ఈ చర్యలతో ఇటీవల రద్దీ సమయాల్లో సత్ఫలితాలొచ్చాయి. నూతన సాఫ్ట్‌వేర్ ద్వారా మరింత పకడ్బందీగా భక్తులకు వసతి కేటాయింపు పక్కాగా పారదర్శకంగా జరుగుతుంది.

● త్వరలోనే నూతన అన్నదాన భవనం: కేంద్ర పథకం 'ప్రసాద్' ద్వారా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అన్నదాన భవనం కొద్ది నెలల్లోనే అందుబాటులోకి రానుంది. ఆధునిక వంటశాల నిర్మాణానికి ప్రణాళిక చేశాం. నాణ్యమైన అన్నప్రసాదాన్ని అందిస్తాం. గోదుమనూక ప్రసాదాన్ని మరింత నాణ్యంగా అందించేందుకు నిత్యం పర్యవేక్షిస్తున్నాం. దుకాణాల్లో అధిక ధరల విక్రయాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకున్నాం.

● విస్తృత తనిఖీలతో భక్తులకు భరోసా: భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భద్రతపై దృష్టిసారించాం. తనిఖీలు విస్తృతం చేశాం. టోల్‌గేటు వద్ద వాహనాలు తనిఖీ చేసిన తర్వాతే కొండపైకి అనుమతిస్తాం. మద్యం సీసాలు ఎవరి వాహనాల్లో అయినా దొరికితే కఠిన చర్యలు ఉంటాయి. మద్యం తాగి వాహనాలు నడిపినట్లు తనిఖీల్లో బయటపడ్డా ఉపేక్షించం. అటువంటి వారికి జరిమానా విధించేలా ప్రణాళిక చేస్తాం.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం



భవనం ప్రారంభించి.. ప్రసాదం స్వీకరించి..

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో వకుళమాత అన్నప్రసాద భవనాన్ని ప్రారంభిన తర్వాత ప్రసాదం స్వీకరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ. చిత్రంలో ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, ఆరిమిల్లి రాధాకృష్ణ, పితాని సత్యనారాయణ – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

కొత్తపేట, న్యూస్‌టుడే: కొత్తపేట సబ్‌స్టేషన్‌లో రంగులు, ట్రీ కటింగ్ పనులు చేపడుతున్నందున మండల పరిధిలో కొత్తపేట, వాడపాలెం, పలివెల, గంటి, అవిడి, కొత్తపాలెం, ఖండ్రిక గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ డీఈ కె.రాంబాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
ఉ॥ 10 - మ॥ 1
రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229
కొత్తపేట: 90323 93884

వీధి దీపాలు వెలిగాయి

స్పందనకు వందనం

ఆత్రేయపురం : రాజవరంలో వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను గ్రామ ప్రత్యేకాధికారి పీవీ ప్రసాదరావు వద్ద ప్రస్తావించగా విద్యుత్తు లైన్లకు మరమ్మతులు చేయించారు.

మామిడికుదురు: ఆదుర్రు పరిధి గుడ్లగుమ్మిమెరక, గరువులో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను కార్యదర్శి బీవీవీ సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి కొత్తగా ఎల్ఈడీ దీపాలు వేయించారు.

అంబాజీపేట: కొర్లపాటివారిపాలెం గ్రామ సచివాలయం వెనుక వీధిలో విద్యుత్తు దీపాలు వెలగక స్థానికులు పడుతున్న ఇబ్బందులపై 'కొర్లపాటివారిపాలెంలో అంధకారం' శీర్షికతో ఈ నెల 29న చిత్రవార్త ప్రచురితమైంది. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో కంచి శ్రీనివాస్ స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

లోవోల్టేజీ నివారణకు చర్యలు: ఎమ్మెల్యే



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

అంతర్వేది, న్యూస్‌టుడే: తీరప్రాంత గ్రామాలకు లోవోల్టేజీ సమస్య రానివ్వమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అంతర్వేదికరలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రెవెన్యూ, విద్యుత్తు శాఖల అధికారులు, స్థానికులతో కలిసి ఆదివారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య ఉండటం, రోజు రోజుకు ఆక్వాసాగు పెరగడం వల్ల వచ్చే సమస్యలను పరిష్కరించడానికి సబ్‌స్టేషన్ అవసరమని గుర్తించి నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల రాబోయే 30 ఏళ్లలో విద్యుత్తు సమస్య రాదన్నారు. వీటితో పాటు గ్రామాల్లో ముంపు, మంచినీరు, రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టామని వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదకాపు, తహసీల్దార్ సూర్యనారాయణరాజు, ఏఈ ప్రసాద్, పోతురాజు కిషోర్, బాబూరావు, రావూరి నాగు పాల్గొన్నారు.

గోదావరి గట్లు.. వ్యర్థాల గుట్టలు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం



ఆత్రేయపురం పుష్కర ఘాట్ వద్ద ..

మండల కేంద్రం ఆత్రేయపురం గ్రామంలో సేకరించిన చెత్తను నిల్వ చేయడానికి స్థలం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామంలో 6 వేలకుపైగా జనాభా ఉన్నారు. రోజూ టన్నులకొద్దీ చెత్త పోగవుతోంది. ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా సేకరిస్తున్న చెత్తను ఒకచోటకు చేర్చేందుకు అనువైన ప్రభుత్వ స్థలం లేకపోవడంతో గౌతమి గోదావరి తీరాన ఉన్న అత్రిమహాముని పుష్కర ఘాట్ వెంబడి వేస్తున్నారు. ఇక్కడ దారి పొడవునా చెత్త గుట్టలు దర్శనమిస్తున్నాయి. భరించలేని దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా సంపద కేంద్రం నిర్మించేందుకు స్థలం సేకరించలేదు. పుష్కరాలు సమీపిస్తున్నా గోదావరి గట్టు, ఘాట్ల ప్రక్షాళన దిశగా అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. వెలిచేరు తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఉచ్చిలి, రాజవరం, బొబ్బర్లంక తదితర గ్రామాల్లో సంపద కేంద్రాలున్నా ఉపయోగించకుండా కాలువ గట్లు, ఇతర ఖాళీ స్థలాల్లో చెత్త పారేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రం, పచ్చదనం పెంపు తదితర కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నా క్షేత్రస్థాయిలో కార్యాచరణ అమలు కావడం లేదు. ఉచ్చిలిలో సచివాలయం పక్కనే ఉన్న ఖాళీస్థలంలో చెత్త వేసి నిప్పు పెడుతున్నారు. కాలుష్యం వెదజల్లుతున్నా పంచాయతీ పట్టించుకోవడం లేదు. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామ్‌స్వరూప్ వద్ద ప్రస్తావించగా ప్రజా జీవనానికి ఎటువంటి ఆటంకం కలగకుండా కట్టుదిట్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు.



పతకం అందుకుంటున్న నాగశ్రీరామరాజు

మారథాన్‌లో ప్రతిభ

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: హైదరాబాద్ రన్నర్స్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 15వ ఎన్ఎండీసీ మారథాన్‌లో ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుడు దాట్ల నాగ శ్రీరామరాజు ప్రతిభ కనబరిచారు. 45-54 సంవత్సరాల విభాగంలో 42.2 కి.మీ పరుగును 3.11 గంటల్లో పూర్తిచేసి ద్వితీయ స్థానంలో నిలిచి పతకం అందుకున్నారు.

ఇక విద్యుత్తు వెలుగులే..

– న్యూస్‌టుడే, అంబాజీపేట

అంబాజీపేట మండలం ముక్కామల విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో నిత్యం ఏదో సమస్యతో సరఫరా నిలిచిపోయేది. ఓవర్‌లోడు, లోవోల్టేజీ తదితరాలతో ప్రజలు ఇబ్బందులు చవిచూసేవారు. ఇక వేసవిలో అయితే చెప్పక్కర్లేదు. నిత్యం యాతనే. వీటన్నింటికీ చరమగీతం పాడేందుకు ఆ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ముక్కామల సబ్‌స్టేషన్‌లో కొత్తగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. వారం, పది రోజుల్లో పూర్తయితే ఈ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలకు సాధ్యమైనంత వరకు సమస్యలు ఉండవు.

రూ.1.23 కోట్లతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ముక్కామల ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సమస్యలను ఆధిగమించేందుకు రూ.1.23 కోట్లతో కొత్తగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు సరఫరాను దీని ద్వారా అందించవచ్చని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

12 ప్రాంతాల్లో సమస్యలకు చెక్.

అంబాజీపేట, అయినవిల్లి, కొత్తపేట మండలాల్లోని ముక్కామల, నేదునూరు పెదపాలెం, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, చినలంక, ఇరుసుమండ, మోడేకుర్రు, రాకుర్తివారిపాలెం, వక్కలంక, పసుపల్లి, కముజువారిపాలెం, శ్రీరాంపురం తదితర ప్రాంతాలకు విద్యుత్తు సమస్యలు పరిష్కారం కానున్నాయి.



పనులను పరిశీలిస్తున్న ఏఈ, ఇతర అధికారులు

వారం రోజుల్లో అందుబాటులోకి

ముక్కామల ఉపకేంద్రం ఆవరణలో రూ.1.23 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న కొత్త పవర్‌ట్రాన్స్‌ఫార్మర్ మరో వారం, పది రోజుల్లో అందుబాటులోకి రానుంది. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించడంతో పాటు లోవోల్టేజీ, ఓవర్‌లోడ్, సరఫరా నిలుపుదల వంటి సమస్యలు పరిష్కారం అవుతాయి. - కవిత, ఏఈ, విద్యుత్తుశాఖ, అంబాజీపేట

ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి

అంబాజీపేట: అర్హత గలవారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని పి.గన్నవరం నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.సురేష్‌కుమార్ అన్నారు. ఈ నెల 31 వరకు గడువు ఉందని చెప్పారు. అంబాజీపేట మండలంలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాలను ఆయన తహసీల్దార్ బి.చినబాబుతో కలిసి తనిఖీ చేశారు. ఆర్ఐ ఏడుకొండలు ఉన్నారు.

రెండేళ్ల పాలనలో అన్నింటా ప్రగతి

మామిడికుదురు, అంబాజీపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధితో అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధించిందని తెదేపా నాయకులు తెలిపారు. ఇంటింటికీ తెదేపా కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాశర్లపూడిలంకలో పర్యటించారు. సాధించిన అభివృద్ధి, అమలు చేసిన హామీలకు సంబంధించిన వివరాలతో ముద్రించిన కరపత్రాలను అందజేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బోనం బాబు, కోలా సత్యనారాయణ, పితాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● మామిడికుదురులో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మెండా సత్యవతి, తెదేపా మండల కార్యదర్శి విత్తనాల జానకీరామ్ పాల్గొన్నారు. ● కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలో పేదలకు పలు సంక్షేమ పథకాలు అందించిందని పి.గన్నవరం నియోజకవర్గ తెదేపా కోకన్వీనర్ దాసరి వీరవెంకటసత్యనారాయణ అన్నారు. కె.పెదపూడిలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలను అందజేశారు. మాజీ సర్పంచి రాయపురెడ్డి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ పెచ్చెట్టి హరిబాబు, తిరుమనాథం వీరహనుమంతరావు, చిక్కం ఏసు, దొమ్మేటి బాబూప్రసాద్ పాల్గొన్నారు.



పాశర్లపూడిలంకలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు



కె.పెదపూడిలో..

బీమా పరిహారం వితరణ

అంబాజీపేట, న్యూస్‌టుడే: మాచవరం మెట్లకాలనీకి చెందిన తెదేపా కార్యకర్త అడబాల సాయిగురుదత్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆయనకు పార్టీ తరపున రూ.5 లక్షల ప్రమాద బీమా మంజూరైంది. ఈ మొత్తాన్ని నామినీ బ్యాంకు ఖాతాలో జమచేశారు. వీటికి సంబంధించిన పత్రాలను కూటమి నేతలు నాగాబత్తుల వెంకటసుబ్బారావు, బొంతు పెదబాబు, దాసరి వీరవెంకటసత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొర్లపాటి వెంకటేశ్వరరావు, గూడాల ఫణి, రవణం రాము ఆదివారం అందజేశారు.

రహదారి పొడవునా.. వీడని యాతన



మామిడికుదురు నుంచి మగటపల్లి వరకు నాలుగున్నర కిలోమీటర్ల మేర ర.భ. శాఖ రహదారి పంటకాలువ వైపు పలుచోట్ల కుంగిపోతుండటంతో రాకపోకలకు ప్రజలు యాతన పడుతున్నారు. బుల్లియ్యవంతెన, మాకనపాలెం, మగటపల్లిలో ఆరుచోట్ల ఇదే దుస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో ఇక్కడ తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చర్యలు చేపడతామని సంబంధిత ఏఈఈ కె.సురేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

మండపానికి మరమ్మతులు చేపట్టండి



గుడిమెళ్లంకలో 2016లో ప్రభుత్వ నిధులతో నిర్మించిన కల్యాణ మండపానికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం రంగులు వెలిసిపోయి బీటలువారింది. అయినా ఇందులోనే వివాహ తదితర శుభకార్యాలు నిర్వహించుకుంటున్నారు. కనీసం రంగులు వేసి చిన్నచిన్న మరమ్మతులు చేపడితే బాగుంటుందని స్థానికులు అంటున్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

ఆర్థిక సాయం అందజేత

రాజోలు, న్యూస్‌టుడే: శివకోటికి చెందిన చిట్టూరి శివనాగేంద్రకుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు గల్ఫ్ మిత్ర మండలి సేవా సమితి, నిమ్స్ శ్రీహరిరాజు మిత్ర బృందం, గుడిమెళ్లంక ఛారిటబుల్ ట్రస్ట్ సేకరించిన రూ.35,025 మొత్తాన్ని సేవా సమితి ఎన్ఆర్ఐ సభ్యులు కోళ్ల శ్రీనివాస్ దంపతులు, కోళ్ల లక్ష్మీకిరణ్ దంపతులు ఆదివారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కట్టా పూర్ణసత్యనారాయణ, చెల్లుబోయిన సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలోని అన్నదాన ట్రస్టుకు ఉండ్రాజవరానికి చెందిన సుంకపల్లి లక్ష్మీతులసి, కుటుంబ సభ్యులు ఆదివారం రూ.1,00,116 విరాళాన్ని సమర్పించారు. వీరికి అర్చకుడు స్వామివారి తీర్థప్రసాదాలు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ విళ్ల సూర్యనారాయణ చిత్రపటాన్ని బహూకరించారు.



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అర్చకుడు

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ వీర్రాజు

ఆత్రేయపురం: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారిని ఎమ్మెల్సీ సోము వీర్రాజు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రం కప్పి ఆశీర్వచనం గావించారు.

తూర్పుపాలెంలో అగ్నిప్రమాదం

మలికిపురం, న్యూస్‌టుడే: తూర్పుపాలెంలో ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో సుమారు ఐదెకరాల్లోని సరుగుడు తోట పాడైంది. సమీపంలోని మొగలి డొంకలకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి సరుగుడు తోటలోని ఎండిన చెత్త, వ్యర్థాలు అంటుకున్నాయి. దీంతో పాటు కొన్ని కొబ్బరి మొక్కలు, చెట్లు, జీడిమామిడి, మామిడి చెట్లు కూడా దెబ్బతిన్నట్లు బాధిత రైతులు వాపోయారు. సమాచారం అందుకున్న రాజోలు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

ఎట్టకేలకు చెత్త తొలగింపు

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురం వాణిజ్య కూడలిలో పేరుకుపోయిన చెత్తను ఎట్టకేలకు తొలగించారు. స్థానిక వెంకటనారాయణ సినిమాహాలు సమీపంలోని ఓ హోటల్ కార్మికుడు, పంచాయతీ కార్మికులు, సిబ్బంది మధ్య తలెత్తిన వివాదం నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికులు రెండ్రోజులు నిరసన తెలుపుతూ విధులకు దూరంగా ఉన్నారు. వ్యవహారం స్థానిక పోలీసు స్టేషనుకు చేరడం, పారిశుద్ధ్య కార్మికులు నిరసన తెలపడం వంటి ఘటనలతో పారిశుద్ధ్య చర్యలు నిలిచిపోయి కూడలి అస్తవ్యస్తమైంది. దీంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచనతో కార్మికులు ఆదివారం చెత్తను తొలగించినట్లు కార్యదర్శి తాడి ఏసుబాబు చెప్పారు. ప్రస్తుతం కూడలిలోని చెత్తను మాత్రమే తొలగించామని, ఆయా వీధుల్లో ఇంకా తొలగించలేదని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్రేయపురం : ప్రమాదవశాత్తు ఆటో నుంచి జారిపడి కిందపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా గుర్ల మండలం చుక్కపేటకు చెందిన ఆవాల రాజారావు(41) వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని శనివారం ఉదయం తిరుగు ప్రయాణంలో ఆటో వెనుక భాగంలో కూర్చుని ప్రయాణం చేస్తున్నాడు. బ్యారేజీ సమీపంలోని పిచ్చుకలంక వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు రోడ్డుమీద పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతిచెందాడు. దీనిపై ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.రాము తెలిపారు.

'రిజర్వేషన్ హఠావో పేరుతో అలజడులు'



మాట్లాడుతున్న సుబ్బరాజు

మలికిపురం, న్యూస్‌టుడే: రిజర్వేషన్ హఠావో ఉద్యమం పేరుతో అలజడులు సృష్టించాలని కుట్రలు జరుగుతున్నాయని, దీనిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఏపీ హేతువాద సంఘం పూర్వ అధ్యక్షుడు పెమ్మెత్స సుబ్బరాజు, దళిత బహుజన మహిళాశక్తి జాతీయ కన్వీనరు కె.రాజమణి అన్నారు. మలికిపురం పులె-అంబేడ్కర్ సామాజిక భవనంలో జనిపల్లి సత్యానందం, ముత్యాల శ్రీనివాసరావు అధ్యక్షతన 'రిజర్వేషను వ్యతిరేక ఉద్యమం- పరిణామాలు, భవిష్యత్తు కార్యాచరణ' అనే అంశంపై ఆదివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు ముఖ్యవక్తలుగా పాల్గొన్నారు. దేశంలో కులం, మతం, అసమానతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, సామాజిక హోదా, సంపద, రాజ్యాధికారం, ఆధిపత్య కులాలకే పరిమితమయ్యాయన్నారు. ప్రతిభ గురించి మాట్లాడేవారు డొనేషను, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు పొందుతున్న వారి గురించి మాట్లాడాలన్నారు. రిజర్వేషన్లు ఆర్థిక ప్రాతిపదికన కాదని, సామాజిక వెనుకబాటుతనం ప్రాతిపదికన ఇవ్వాలన్నారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బూసి జాన్‌మోషే, ఎ.రవి, మెడబల రాజ్‌కుమార్, బడుగు భాస్కరజోగేష్, నల్లి ప్రసాద్, జి.ఆర్.జ్యోతి, నరసింహారావు, గణేష్, సూర్యప్రకాశ్ మాట్లాడారు.



భవనం ప్రారంభించి.. ప్రసాదం స్వీకరించి..

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వకుళమాత అన్నప్రసాద భవనాన్ని ప్రారంభించిన తర్వాత నాయకులు ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, ఆరిమిల్లి రాధాకృష్ణ, పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • రామచంద్రపురం

సీజీఎల్ అభ్యర్థులకు 2న ధ్రువపత్రాల పరిశీలన

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ఎగ్జామినింగ్ అథారిటీ నిర్వహించిన సీజీఎల్ ఉద్యోగ నియామక పరీక్ష ఫలితాలను శనివారం రాత్రి విడుదల చేశారు. అయిదు శాఖల్లో ఎనిమిది రకాల పోస్టులకు నిర్వహించిన పరీక్షకు 15,555 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఒక్కో పోస్టు కోసం ముగ్గురిని ప్రావిజినల్‌గా ఎంపిక చేసి సెప్టెంబరు 21నుంచి 25వరకు ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేయనున్నట్లు ఎగ్జామినేషన్ కంట్రోలర్ పంకజ్‌కుమార్ ఝా తెలిపారు. ధ్రువ పత్రాల పరిశీలన అనంతరం ఎంపికైన వారి జాబితా ప్రకటిస్తామన్నారు. అభ్యర్థులు పరీక్ష ఫలితాలను https://recrutiement.py.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

✆ ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718 , ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716



యర్రమిల్లివారివీధిలో వ్యర్థాల తరలింపు

సమస్య: అమలాపురం యర్రమిల్లివారివీధిలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి అపరిశుభ్రంగా తయారైంది. వీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలి. **-శశికాంత్, స్థానికుడు**

సమస్య: దొమ్మేటివారివీధిలో రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో దోమలు అధికమయ్యాయి. **-వీరబాబు, వ్యాపారి**

సమస్య: శ్రీరామపురం మురుగు కాలువపై నిర్మాణ వ్యర్థాలు పడిపోవడంతో మురుగు ముందుకు కదలక ఇబ్బందులు పడుతున్నాం.

-శ్రీనివాస్, స్థానికుడు

సమస్య: అశోక్‌నగర్ రోడ్డుపై మట్టి వ్యర్థాలు పేరుకుపోవడంతో అటుగా వెళ్లే వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

- ప్రశాంత్, వాహనదారుడు

పరిష్కారం: యర్రమిల్లివారివీధి, దొమ్మేటివారివీధి, శ్రీరామపురం మురుగుకాలువ, అశోక్‌నగర్‌లలో సమస్యలు తెలుపగా ఆయా వార్డుల సచివాలయ కార్యదర్శులు స్పందించారు. సిబ్బందితో వాటిని తొలగింపజేశారు.

–న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

వీధి దీపాలకు మరమ్మతులు

సమస్య: కాట్రేనికోనలోని చెంచులగరువులో కొన్నిచోట్ల వీధిదీపాలు వెలగకపోవడంతో ప్రజలు రాత్రివేళ ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెలగని మరమ్మతులు చేపట్టాలి. **- స్థానికులు**

పరిష్కారం: ఈ సమస్యను పంచాయతీ ప్రత్యేకాధికారి ఎంపీడీవో రాజేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణకు తెలుపగా స్పందించారు. ఇక్కడ వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేయించారు.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన

అరకొర ఆధునికీకరణ.. అందుబాటులోకి రాక

● అధ్వానంగా అయ్యవారి చెరువు పార్కు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం:

ముమ్మిడివరం పేరుకే నగర పంచాయతీ. ఇక్కడ ఓ పార్కు గానీ, 10 మంది కూర్చోవడానికి సరైన స్థలం గానీ లేదు. గతంలో పోలమ్మ చెరువు గట్టున ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ కూడా కుంగిపోయింది. వ్యాహ్యాళికి వెళ్లే వారి కాళ్లకు బంధం పడింది. నగర పంచాయతీలో సరదాగా కూర్చోవడానికి సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అమృత్ 2.0 పథకంలో రూ.63 లక్షలతో మార్కెట్ ప్రాంతంలోని అయ్యవారిచెరువు సుందరీకరణకు చర్యలు చేపట్టడంతో ప్రజలకు పార్కు అందుబాటులోకి వస్తుందని ఆశించారు. నిధులు సరిపోక పనులు అరకొరగా వదిలేశారు.



సుందరీకరించిన అయ్యవారిచెరువు ఇలా..

మూడేళ్ల క్రితం ప్రారంభించి..

అయ్యవారిచెరువు సుందరీకరణకు మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించి పూర్తి చేశారు. చెరువు చుట్టూ గట్టును గ్రావెల్‌తో చదును చేసి, రాతికట్టడం, చుట్టూ ప్రజలు నడిచే విధంగా పలకలతో వాకింగ్ ట్రాక్ నిర్మించాలి. రక్షణకు సంబంధించి చుట్టూ ఫెన్సింగ్, చెట్ల పెంపకంతో సుందరంగా తీర్చిదిద్దడానికి పనులు చేపట్టగా నిధులు సరిపోకపోవడంతో వాకింగ్ ట్రాక్‌పై పలకలు ఏర్పాటు చేయలేదు. దీంతో చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. కనీసం గ్రావెల్‌తో ఏర్పాటు చేసిన కాలిబాటనైనా పూర్తిగా అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు.

పథకం స్వరూపం ఇలా..

పథకం పేరు: **అమృత్ 2.0**
అంచనా: **రూ.63 లక్షలు**
చెరువు విస్తీర్ణం: **అయ్యవారి చెరువు 4.26 ఎకరాలు**
రాతి కట్టడం: **900 చదరపు మీటర్లు**
పుట్ పాత్: **1000 మీటర్లు**

పనులు పూర్తిచేస్తాం

అమృత్ 2.0 పథకంలో ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతంలోని అయ్యవారిచెరువు ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. చెరువు చుట్టూ మొక్కలతో సుందరీకరణ, వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేశారు. అసంపూర్తి పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తాం. – పి.రవివర్మ, కమిషనర్, ముమ్మిడివరం



మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి శివశంకర్

చట్టాలపై సమగ్ర అవగాహన ఉండాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: న్యాయవాదులకు చట్టాల పట్ల సమగ్ర అవగాహన ఉండాలని విశ్రాంత న్యాయమూర్తి బులుసు శివశంకర్ పేర్కొన్నారు. అమలాపురం కిమ్స్ వేడుక మందిరంలో ఇండియన్ అసోషియేషన్ ఆఫ్ లాయర్స్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ ఆస్తి చట్టాలను సుప్రీం కోర్టు, హైకోర్టు తీర్పులను ఉదహరించారు. తీర్పులు పట్ల న్యాయవాదులు ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకుని కక్షిదారులు న్యాయం అందజేయాలని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆజామ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నిస్వార్థ కార్యకర్తలే తెదేపాకు బలం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: గ్రామస్థాయి నుంచే నిస్వార్థంగా సేవలందించే కార్యకర్తలే తెదేపాకు బలమని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ఐ.పోలవరం మండలం కొమరగిరికి చెందిన తెదేపా కార్యకర్త పెన్మెత్స సూర్యవర్మ తన 20 సెంట్ల స్థలంలో నిర్మించిన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సూర్యవర్మకు పార్టీపై ఉన్న అభిమానానికి ఇది నిదర్శనమని ఎమ్మెల్యే కొనియాడారు. దీనిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి గ్రామంలో కార్యాలయాల నిర్మాణాలకు పలువురు ముందుకొస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, తాడి నర్సింహారావు, దాట్ల పృథ్వీరాజు, సాగిరాజు సూరిబాబు, సాకా సీతాదేవి, గాదిరాజు బుచ్చికృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, నాయకులు

పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలెంలో జనసేన యూత్ ఆధ్వర్యంలో పవన్‌కల్యాణ్ కటౌట్‌ను ఆదివారం ఆవిష్కరించారు. అభిమానులు ఏర్పాటు చేసిన కేకును కోశారు. తెదేపా నాయకుల దాట్ల పృథ్వీరాజు, జనసేన పార్టీ నాయకులు గుద్దటి జమ్మి, గోదశి పుండరీష్, బద్రి రమాదేవి పాల్గొన్నారు.



రాజుపాలెంలో కేకు కోస్తున్న నాయకులు

వంతెన.. ఇంతేనా..?

నరిపల్లి గ్రామంలోని చిన్నకాలువపై ఉన్న వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. ఎస్ ఆకారంలోని మలుపులో ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో, వర్షాలు పడే సమయంలో వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉంది. పది గ్రామాలకు చెందిన వాహనదారులు, విద్యార్థులు, రైతులు నిత్యం రాకపోకలు సాగించే ఈ మార్గంలో వంతెనకు రైలింగ్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం



ఏళ్లుగా నిర్మాణంలోనే..

గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలను అందించేందుకు చేపట్టిన విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనాల నిర్మాణాలు కొన్నిచోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. కాట్రేనికోన-3 గ్రామ సచివాలయానికి సంబంధించి అడవిపేటలో చేపట్టిన విలేజ్‌హెల్త్‌క్లినిక్ నిర్మాణం సుమారు మూడున్నరేళ్ల కాలంగా అసంపూర్తిగా నిలిచింది. భవనం స్లాబ్ వేశాక గోడలు కట్టి వదిలేశారు. కిటికీలు, తలుపులు, ప్లాస్టరింగ్, విద్యుత్తు వంటి పనులు పూర్తిచేయాల్సి ఉంది. దీని చుట్టూ తుప్పలు పెరిగాయి. అధికార యంత్రాంగం దృష్టిసారించి పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కాట్రేనికోన



అల్లుకున్న ప్రమాదం

అమలాపురం పేరూరు వై జంక్షన్‌లో విద్యుత్తు స్తంభానికి తీగజాతి పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. అటుగా వెళ్లే వాహనదారులకు, ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. ఆవులు, మూగజీవాలు పచ్చిమేత కోసం పొరపాటున ఆ ప్రాంతానికి వెళ్తే ప్రమాదమే. అధికారులు స్పందించి వీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం



నవోదయ విద్యార్థుల ప్రతిభ

యానాం, న్యూస్‌టుడే: యానాం జవహర్ నవోదయ విద్యాలయలో చదివిన ఇద్దరు విద్యార్థులు ఉన్నత అవకాశాలు అందుకున్నారు. 2024లో సీబీఎస్‌ఈ ఫలితాలలో జాతీయ స్థాయిలో 4వ ర్యాంకు పొందిన విద్యార్థిని యు.సుహితా ఏంజెల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్‌ఈఆర్-తిరుపతి)లో సీటు సాధించింది. కాసు నాని ఎన్ఐటీ కారైకాల్‌లో సివిల్ ఇంజినీరింగ్‌లో సీటు సాధించాడు. వారిని ప్రిన్సిపల్ సునీల్‌కు మార్ థాకర్ అభినందించారు.

'చిర్రయానంలో క్షుద్రపూజలపై విచారణ చేపట్టాలి'

కాట్రేనికోన : కాట్రేనికోన మండలం చిర్రయానంలో ఇటీవల క్షుద్రపూజలు చేసిన అంశం కలకలం రేపింది. దీనిపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈనెల 25న రాత్రి ఓ మహిళతోపాటు సుమారు 8మంది సముద్రతీరం కాలభైరవుని గుడి సమీపంలోకి వచ్చిన వారిని స్థానికులు గుర్తించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిని విచారించి ఆ రాత్రే వదిలేశారు. కాగా దీనిపై శనివారం కాట్రేనికోనలో ఓ నాయకుడి ఇంటి వద్ద చిర్రయానం పెద్దలకు, క్షుద్రపూజలకు వచ్చారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి రాజీ సమావేశం జరిగిందని కొందరు ఆరోపిస్తున్నారు. పోలీసులు విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై కాట్రేనికోన ఎస్సై సత్యనారాయణను వివరణ కోరగా 8 మందిపై కేసు నమోదు చేసి, 41ఏ నోటీసు ఇచ్చామన్నారు. దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఉప్పలగుప్తం: ఎస్.యానాం ఆంధ్రా గోవా కోకో బీచ్‌లో కాలభైరవ స్వామి ఆలయ నిర్మాణానికి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న ఎస్.యానాం బీచ్ ఆలయ నిర్మాణంతో ఆధ్యాత్మిక కేంద్రంగానూ రూపుదిద్దుకుంటుందన్నారు. ఇక్కడకు వచ్చే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు, తదితరులు

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి సీఎస్ఎం కళాశాలలో చదువుతున్న అయిదుగురు విద్యార్థులకు స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు మంచెం బాలకృష్ణ ఆర్థిక చేయూత అందించారు. అమలాపురంలోని ఆదివారం జరిగిన కాపు ఉద్యోగ సేవాసమితి సభలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులు నార్ని భార్గవ్, దాసరి సత్య, అరవ దుర్గశరత్, కామిరెడ్డి మోహన రమాదేవి, చాగలంటి శ్రీ చరణ్‌లకు ఒక్కొరికి ఐదు వేల చొప్పున రూ.25వేలు అందించి తన ఔన్నత్యాన్ని చాటారు.

తక్కువ ధరకు సన్నబియ్యం

అమలాపురం పట్టణం: కేంద్రప్రభుత్వం వినియోగదారులకు తక్కువ ధరకు సన్నబియ్యం అందిస్తోందని, వినియోగదారులు ఉపయోగించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ మాలకొండయ్య కోరారు. అమలాపురం రైతుబజార్‌లో బియ్యం విక్రయాలను భాజపా నాయకులు ఆదివారం పరిశీలించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్, సంసాని రత్నకుమార్, అరిగెల నాని, ఆకుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు

తాళ్లరేవు: గాడిమొగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన దృష్టి కంటి ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యుల పర్యవేక్షణలో 500 మందికి కంటి పరీక్షలు చేశారు. 355 మందికి కళ్లద్దాలు సమకూర్చగా , 60మందిని శుక్లాల శస్త్రచికిత్సకు సిఫార్సు చేశారు. రిలయన్స్ సీఎస్ఆర్ ప్రతినిధులు సురాపు నాయుడు, సుబ్రహ్మణ్యం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దృష్టి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



నేత్ర పరీక్ష చేస్తున్న వైద్యురాలు

పాడి రైతులకు భరోసా

● 'న్యూస్‌టుడే'తో ఏడీప విజయారెడ్డి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అమలాపురం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయారెడ్డి అన్నారు. పాడి పశువులకు ఎటువంటి రోగాలు దరి చేరకుండా ఎప్పటికప్పుడు టీకాలు వేస్తున్నామన్నారు. పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రైతులకు భరోసా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో ప్రాంతీయ పశువైద్యశాల వద్ద త్వరలోనే పశు ఔషధ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పశువైద్యశాల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలను 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వివరించారు.



పశువైద్య శిబిరాల ఏర్పాటు

అమలాపురం మండలంలోని వన్నెచింతలపూడి, సమనస, డి.రావులపాలెం, గూడాల గ్రామాల్లో ఇప్పటికే పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసి గర్భకోశ వ్యాధులు రాకుండా చికిత్సలు చేశాం. వన్నెచింతలపూడి, సమనసలో లేగ దూడల అందాల పోటీలను నిర్వహించి రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందించాం. త్వరలో సావరం, సాకుర్రు, అల్లవరం మండలంలోని ఒక గ్రామంలో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం. పశు బీమా పథకం ద్వారా అమలాపురంలో 126, అల్లవరంలో 120 పశువులకు, 91గొర్రెలకు పశుబీమా వర్తింపజేసేలా చర్యలు తీసుకున్నాం. .

పీఏసీఎస్‌లలో దాణాలు..

ముఖాముఖి

పశువుల దాణాలు మార్కెట్‌లో అధిక ధరలున్నాయి. పాడిరైతులకు పశువుల దాణాలను తక్కువ ధరకు అందించేందుకు వన్నెచింతలపూడి, రోళ్లపాలెం, అల్లవరం, కొమరిగిపట్నం పీఏసీఎస్‌లలో అందుబాటులో ఉంచాం. 50 కేజీల బస్తాను రూ.1020కు విక్రయిస్తున్నారు. ఇప్పటికే పలువురు పాడి రైతులు ఈ దాణాలను కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

సంచార వాహనాలతో వైద్యం

మండలానికి రెండు రోజులు అందుబాటులో ఉండేలా సంచార వాహనాల ద్వారా సేవలు అందిస్తున్నాం. వీటిలో రైతులకు అవసరమైన చికిత్స అందించడంతోపాటు మందులను ఉచితంగా అందిస్తున్నాం. నెలలో ప్రతి మొదటి శుక్రవారం ఈ వాహనాల ద్వారా చేపడుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించి రైతులకు మెరుగైన సేవలను అందించే విధంగా సూచనలు చేస్తున్నాం.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: రావులపాలెం మండలం రావులపాడులోని అభయ ఆంజనేయస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు పూజ్యం విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి శాంతి కల్యాణం, హోమం నిర్వహించారు.

అప్రమత్తత అవసరం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలు దొంగతనాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల గురించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ వీరబాబు కోరారు. అమలాపురం మండలం పేరూరులో ఎస్సై కిషోర్‌బాబు ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి విక్రయాలపై సమాచారం ఉంటే 1972కు ఫోన్ చేయాలన్నారు.

కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు



చెన్నమల్లేశ్వర కళాపరిషత్ ప్రాంగణంలో విద్యార్థులతో కూటమి నాయకులు

అమలాపురం పట్టణం, : కోనసీమ వ్యాప్తంగా ఎందరో ప్రతిభావంతులైన పేద కాపు విద్యార్థులకు సంఘం నాయకులు ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెదేపా నాయకులు మెట్ల రమణబాబు, అల్లాడ స్వామినాయుడు అన్నారు. అమలాపురం చెన్నమల్లేశ్వర కళాపరిషత్ ప్రాంగణంలో కోనసీమ కాపు ఉద్యోగ సేవా సమితి సంఘ అధ్యక్షుడు నల్లా రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీలో ఉత్తమ మార్కులు సాధించిన 120 మంది కాపు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున రూ.6 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. గౌరవాధ్యక్షుడు అన్యం రాంబాబు మాట్లాడుతూ కాపు ఉద్యోగుల పరస్పర సహకారంతో విద్యార్థులకు అండగా ఉంటున్నారన్నారు. పిండి వరప్రసాద్, కుంపట్ల సుబ్బారావు, నల్లా పవన్, సిరిగినీడి వెంకటేశ్వరరావు, ఆర్డీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటపై వ్యాపారం

● అక్రమ వసూళ్ల పర్వం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణంలో కాలిబాటలను కొందరు ఆక్రమించి వ్యాపార నిర్వహణకు అద్దెలకు ఇస్తున్నారు. ఆయా చోట్ల వివిధ వ్యాపారాలు చేస్తున్నవారు నిర్వాహకులకు అద్దెలు చెల్లించడంతో పాటు ఆశీలు పేరిట కొంత, స్థానిక పోలీసులకు మరికొంత ఇచ్చుకోవాల్సిందే. ఇలా ఒక్కో వ్యాపారి నుంచి రోజుకు రూ.150 వరకు పురపాలక ఆశీలు పాటదారులు.. పోలీసులు.. పుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపార నిర్వహణకు అద్దెకు ఇచ్చిన వ్యక్తి దోచుకుంటున్నారు.

పురపాలక సంఘం గుర్తింపు పొందిన వీధి వ్యాపారులు 246 మంది ఉండగా ఎలాంటి గుర్తింపు లేకుండా అనధికారికంగా వ్యాపారం చేస్తున్నవారు మరో 230 మంది ఉన్నారు. పట్టణంలోని ప్రధానరోడ్డు పొడవునా రెండు కిలోమీటర్ల వరకు ఇరువైపులా వీరు అనధికారికంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద మూడు తోపుడుబళ్లు పెట్టి ఒకరు, ఏరియా ఆసుపత్రి ఎదురుగా నాలుగు బళ్లపై మరొకరు, కృత్తివెంటి పేర్రాజు పంతులు ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల ఎదుట మరికొందరు వ్యాపారాలు చేస్తున్నారు.



ఫుట్‌పాత్‌పై గుడారాలు వేసిన వీధి వ్యాపారులు

కమిషనర్, సీఐ ఏమన్నారు..

కాలిబాటల ఆక్రమణలు, అక్రమ వసూళ్లపై మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్ ఆర్.రాజును వివరణ కోరగా పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగిస్తామన్నారు. సీఐ వెంకటనారాయణను వివరణ కోరగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే వ్యాపారాలను వెంటనే తొలగిస్తామన్నారు. పురపాలక సంఘం అధికారులు తొలగింపు ప్రక్రియను ఎప్పుడు ప్రారంభించినా బందోబస్తు కల్పిస్తామన్నారు.

'రాష్ట్రహోదాపై మల్లాడి నిర్ణయం చెప్పాలి'

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి రాష్ట్ర హోదా కోసం ముఖ్యమంత్రితో సహా పలువురు ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తామని అసెంబ్లీలో చెబుతున్నందున మంత్రి మల్లాడి కృష్ణారావు ఈ అంశంపై మాట్లాడకుండా మౌనం వహించడాన్ని మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పుదుచ్చేరి, కారైకాల్, మాహే, యానాం ప్రాంతాలు కలిసి రాష్ట్రం ఉండాలని సీఎం రంగసామి నేతృత్వంలోని కొన్నేళ్లగా ఎమ్మెల్యేలంతా తీర్మానం చేశారని గొల్లపల్లి అన్నారు. రాష్ట్రహోదా ఇస్తే భౌగోళికంగా ఏపీలో ఉన్న యానాం భవితవ్యం గురించి అసెంబ్లీలో మల్లాడి కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. గతంలో రాష్ట్ర హోదా వ్యతిరేకించిన మల్లాడి ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలోని వివిధ క్రీడాప్రాంగణాల్లో ఆదివారం నిర్వహించిన 70వ జాతీయ స్కూల్ గేమ్స్ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలలో యానాం నుంచి 45 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, హ్యాండ్‌బాల్, రోలర్ స్కేటింగ్, బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. జోనల్ గేమ్స్ కార్యదర్శి, వ్యాయామోపాధ్యాయుడు వడ్డి వరప్రసాద్, పాలికి స్వామి, కొప్పనాతి రమేష్, భాస్కర్, చింతా వెంకన్న బృందం పర్యవేక్షించారు. మంత్రి మల్లాడి కృష్ణారావును ఆదివారం రాత్రి వారిని కలుసుకున్నారు.

పొలం.. సాగుకు దూరం



ముంపునీరు దిగే డ్రెయిన్లు పూడికలతో నిండిపోయి అధ్వానంగా ఉండటంతో కొందరు రైతులు తొలకరి సాగుకు దూరమయ్యారు. ఉప్పలగుప్తం మండలం గోపవరంలోని కొందరు రైతులు తొలకరిసాగు చేపట్టపక పోవడంతో వారి పొలాలు కనుచూపు మేర ఇలా పచ్చని తివాచీలా కనిపిస్తున్నాయి. అధికారులు పొలాలకు అనుసంధానంగా ఉన్న డ్రెయిన్లను బాగుచేసి రైతులకు అండగా నిలవాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

ఆలోచించేలా.. అవగాహన కలిగేలా..



దిశ ఆధ్వర్యంలో ఛేంజెస్ స్వచ్ఛంద సంస్థ పర్యవేక్షణలో ఆదివారం కాట్రేనికోన మండలంలోని పల్లం, పల్లిపాలెం, కాట్రేనికోన తదితరచోట్ల ప్రధాన కూడళ్లలో ప్రజలకు హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ వ్యాప్తి, నిర్మూలన, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎల్ఈడీ తెరపై వివరించారు. ఐఈసీ కరపత్రాలను ప్రజలకు అందించారు. భారతి, ఎ.దుర్గ కె.శ్రీనివాస్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు .– న్యూస్‌టుడే, కాట్రేనికోన

సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వాలి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: కాట్రేనికోన మండలంలోని గెద్దనపల్లి పంచాయతీ శివారు ఎస్సీ గ్రామం పోరపేటకు వెళ్లే రోడ్డు ధ్వంసమైంది. ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని జీవీ సుందర్ పేర్కొన్నారు. ఆదివారం పోరపేట గ్రామాన్ని సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఆక్వా చెరువుల కారణంగా అక్కడికి వచ్చే లోడు లారీలతో రోడ్డంతా పాడయ్యిందన్నారు. పంట కాలువలు, బోదెలు కలుషిత వ్యర్థాలతో నిండిపోయాయన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు స్పష్టమైన హామీని ఇవ్వాలని సుందర్ డిమాండ్ చేశారు.